# మొక్కుబడి

'మంజీర'

వెంకటపతి నాయుడుగారిని గురించి, అందరు అనేక విధాల చెప్పుకుంటారు. ఈ పెద్దమనిషి గురించి చెప్పేటప్పుడు, నా పాతికేళ్ళ స్నేహితుడు తన మొఖం గంభీరంగా చేసుకొని, ఆయన చాలా మంచివాడనీ, ఆయనకు ఆయనే సాటి అనీ, అలాంటి ఘనుణ్ణి మరొకణ్ణి తన జీవితంలో చూడలేదనీ, చూడబోడనీ, కాచి వడబోసినట్లు చెప్పాడు. ఇంత పాత స్నేహితుడు అంత గొప్పగా చెప్పుతూంటే కాబోసు అనుకున్నాను. కాదనడానికి దమ్ము లేవు సరిగదా. వాడు నా చెవి నులిమి పుట్టుకుని కొనిపించగల ఆప్తుగల స్నేహితుడు మాటలుగా చీదరాళ్ళు చెప్పడం మానేస్తే "ఇంత దుర్మార్గుడా!" అనిపిస్తుంది. మొత్తంమీద ఆయన మంచివాడు, మంచివాడని, పెద్దమనుష్యులు చెప్పినా, ఆయనే మరో రకం మనుష్యులు ఎంతో చెడవాడంటూ వాపోవటం వింటూంటే యీ మంచి చెడ్డల కేమయినా అర్థముందా అనిపించేది. ఈ పైన యీ రెండు ప్రాతిపదికగా తీసుకుని చూసినా, ఒక నిర్ణీతమయిన పరిస్థితులలో ఉన్న ఒక వ్యక్తి దృష్టిలో ఏదయితే మంచిదో, అదే మరో పరిస్థితులలో ఉన్న ఇంకొకడి దృష్టిలో చెడ్డగా కనిపిస్తుంది. నామట్టుకు నేను యీ వస్తువు చెడ్డది, యీ పని మంచిది అని స్థిరపరచలేను. అందుచేతనే కాబోలు నాయుడుగారిని గూర్చి నేను ఏ అభిప్రాయానికీ రాలేకపోయాను. ఆయన మంచిచెడ్డలు గ్రహించాలంటే, ఆయన సంగతి సందర్భాలు గ్రహించాలి.

వెంట్రుకలన్నీ తెల్లగా నెరిసిపోయి, కళ్ళకు సులోచనాలలంకరించినా, మనిషి పిడుగులాగుంటాడనడానికి సందేహం లేదు. మాటలాడుతూంటే పిట్టలు నీళ్ళు త్రాగవు! చాలా కాలంగా గుమాస్తాపని చేస్తున్నాడు. ఎప్పుడూ ఒకటే వేషం. ఆ జారిపోయ్యే పంచకట్టు, చొక్కాకన్నా చిన్న కోటూ అయినా, నడుస్తూంటే జాలేస్తుంది. ఆయన ఎన్నాళ్ళ బట్టి గుమాస్తాపని చేస్తున్నాడో ఆయనకే తెలీదేమో కూడా నిజానికి!

మొన్న ఈమధ్య ఒకాయన వచ్చాడు. ఆ మహానుభావుడు సైకిలుమీద హిందూదేశం అంతా తిరిగేస్తాడు! అలా మన హిందూదేశాన్ని ఉద్ధరించే శాక, ప్రపంచమంతా చుట్టేసి దక్కా వస్తాడుట! పోమకొంగుడిలాగ! రోజూ సరాసరి 15 మైళ్ళు సైకిలు త్రొక్కుతాడట! అదీ ఆయన ఘనత! ఆ మహనీయుడు వచ్చిన ఆ రోజున సందర్శించడానికి పట్నంజనం అప్పుడే కట్టలు కట్టుకొన్నారు. రోజుకు 15 మైళ్ళు సైకిలు త్రొక్కడమనేదేదో మానవాతీత కార్యంలాగ ఎంచేసి ఆ సైకిలు గాడికి హాహాకారాలతో స్వాగతగీతాలు పాడి రెండుపూటలా మేపి, కొంత దక్షిణ కూడా ఇచ్చి పంపారు, పాపం పిచ్చోళ్ళు. ఆ లెక్కని మా నాయుడుగారు రోజూ చులాగ్గా 15 మైళ్ళదూరం నడుస్తారు. అంటే చిన్నగా రోడ్డుమీద గాకపోయినా ఇంటినుండి ఆఫీసుకు. ఆఫీసులో అధికారివరకు అరడజను సార్లు. ఆ పైన ఇంటి వ్యవహారాలు కొల్లలు! ఈ తిరిగిన దూరం లెక్కవేసి ఉంటుందా ఏమిటి? ఎవడూ లెక్కవేసి చూచుకోడు గాని ఇంత తిరుగుడు తిరుగుతూ, ఆఫీసులో తిట్లు బద్దలయ్యేలాగ చాకిరీచేస్తూ ఇప్పటికి పాతిక సంవత్సరాలు గడిపాడే! ఈయన పోతూంటే, హాహాకారాలు లేవు సరికదా, ప్రక్కన తిట్టకుండానూ, వెక్కిరించకుండాను ఉంటే అంతే చాలు! అదేలేదు. ప్రపంచ ధోరణి ఇంతేనేమో! ఇరవైయేళ్ళనుండి పని చేస్తున్నా ఆయన ఉద్యోగంలో యెదుగూ బొదుగూ లేదు. కాని ఆయన సంసారం మాత్రం అపారంగా పెరిగిపోతూంది. ఏడాదికో నోరు అన్నం కోసం తెరుచుకుంటూంది. నాయుడుగారి ఉద్యోగం మామూలే. ఆ పిల్లలు యెదిగి పెద్దవాళ్ళయ్యారు; ఆ పైన తోడివాళ్ళంతా ఏదో తమాషాగా విసురుతున్నారు కటువుమాటలు. ఆ విసరటంలో ఉన్న అందం ఏమిటంటే, సరిగా నాయుడుగారి చెవిలోనే దూరుతున్నాయవి! నాయుడుగారు ప్రపంచంతో చేయీ చేయీ కలిసిపోయే మనిషి. ప్రపంచానికి అడ్డుతిరగడు. ఎవరేమయినా అడ్డొస్తే సహించలేడు. అందరూ అంతే ఎవరో కొందరు తప్ప. ఇక ఊరుకుంటే తనకున్న పరువూ ప్రతిష్ఠ కాస్తా కొట్టుకుపోతాయేమో అనిందా ప్రవాహంలా వని ఆయన భయం. వెతికి వెతికి చాలా తెలివైనవాళ్ళు, గొప్పవాళ్ళు, తన పిల్లలకు తగినవాళ్ళు, అనుకున్న యువక చక్రవర్తులను ఎంచిఎంచి, తనకున్న స్థిరచరాస్తుల తెగనమ్మగా వచ్చిన ధనంతో కొని పారేశాడు! ఆ యువకరత్నాలకూడా తమకు తగిన విలువ దొరికిందిగదా అన్న ఆశతో ఉబ్బితబ్బిబ్బై ఆ

లంచావతారులను చేపట్టారు. ఆ దెబ్బతో నాయుడుగారింట్లో సిరీ, సంపదకూడా ఖాళీ అయినాయి. అయినా నాయుడుగారి ఆనందానికి మేర లేదు. తను ప్రపంచాన్ని సంస్కరించాడు. ఇంట్లో దమ్మిడీ లేదు. కరువు రోజురోజుకూ పెరుగుతోంది. అమెరికా ఐశ్వర్యంలాగ, ధరలు పదిరెట్లు అయాయి. కాని నాయుడుగారి జీవితం మారలేదు. కష్టం మారలేదు. ఆ అని అడగడానికి వీలేదపడికి. కాని తనకళ్ళముందు, ఉద్యోగంలో చేరినవాళ్ళు, తనవద్ద పని నేర్చుకున్న వాళ్ళు పెద్ద పెద్ద ఉద్యోగస్థులయి పోతున్నారు. వాళ్ళల్లో ఉన్న విశేషం, తనలో లేని శక్తి ఏమిటి చెప్మా అనుకున్నాడు నాయుడుగారు.

ఈ విషయం గురించి పరిశోధనలు చేయటం మొదలుపెట్టారు. దాని అంతూ కనిపెట్టారు, అన్నిటికీ మూలం ఏమిటో గ్రహించాడు. తన ఈ ఆఖరి దశలోనయినా నాలుగురాళ్ళు సంపాయించకపోతే తన పిల్లలగతి యేం కాను! తన వృద్ధాప్యంలో, యింత గింజాకు పై లోకం, ఒక కొని యిస్తుందా తను చేతులు జోడించి దీనంగా ప్రార్థిస్తుంటే? అయినా ప్రపంచానికి అనుగుణంగా నే నడుచుకోవాలి మరి. ఈ విషమయిన ఆలోచనలు ఆయన పెద్దితలలో ప్రవేశించి వృద్ధిపొందిన కొద్దీ, ఇంట్లో ఆర్థిక ప్రతిష్టంభన రెట్టింపు యింది. జీవితం సుఖంగా, శాంతిగా, సాగాలంటే ఎలాగో అలాగ డబ్బు గడించి తీరాలి అనే ఉద్దేశ్యంలోకి వచ్చేశారు నాయుడుగారు. అది మానవ ప్రవృత్తిలోని విచిత్రం. ఒకసారి తనకు కావలసిన విషయం మనస్సులో స్థిరపడిందా, దాన్ని ఎలాగో ఒకలాగ, హిమాలయ ప్రమాణమయిన ఆటంకాలొచ్చినా సాధిస్తుంది. ఆ మనోనిగమన ప్రవృత్తే కావాలి! రావాలి! దాన్నే నాయుడుగారు సాధించగల్గారు. అలా ఊరికే అనుకున్నంత మాత్రంలో నే ఆ ఆదర్శం రాదు. చుట్టూ ఆవరించిన పరిసరాలు కూడా సమకూరాలి.

మగపిల్లల చదువు, యింట్లో తిండి, యింటద్దె, అందరికీ బట్టలు, మనస్సుకు వినోదం, ప్రశాంత వాతావరణం అన్నిట్లో లేదే ఈ జీవితంలో! అన్నీ చిక్కులే!

నాయుడుగారి జీవితం యీ చిక్కులమయం అయింది. ఆయన సంసారంలో ఉన్న వ్యక్తుల జీవితాలన్నీ మెలికలు తిరుగుతుపోయి, చిక్కుపడిన దారపుండలా తయారయాయి. ఒక్క ముడిలో యిమిడింది చిక్కంతా. అదే డబ్బు! అది సంపాదించి తీరుతాననుకున్నాడు, తనలో తను. ఇదివరలో నే యీ అభిప్రాయాన్ని తనకు కలగజేయనందుకు ఆ భగవంతుణ్ణి పూర్తిగా చివాట్లు పెట్టారు. భగవంతుడి కాలెలిసి కలగక పోయినా, తెంతట తనకు కలిగినందుకు, లోలోప తన్ను తను అభినందించుకొని, అప్పుడప్పుడు ఎదురు తిరిగే తన లోలోపలి అంతరాత్మ గొంతులిమి చంపి పారేశాడు నాయుడుగారు!

డబ్బు రాబట్టడం ఆరంభించాడు. డబ్బుకూడా అలాగే రావడం మొదలెట్టింది. డబ్బు వచ్చినకొద్దీ నాయుడుగారికి ధనతృష్ణ అధికమించింది. ఏ పనయినా ప్రతిఫలం ముట్టకుండా ఎందుకు చెయ్యాలి అనే ఉద్దేశంలోకి వచ్చేశాడు. పెదయినా, చిన్నయినా, ఎవరయినా, ఏ పనయినా, తన విధయినా, ఏ మయినా సరే, డబ్బు లేందే నాయుడుగారి వద్ద పనిజరగడం కల్ల అనే ఖ్యాతి గడించాడు ముండావాడు!

కష్టజీవులకిది కష్టంగా ఉన్నా, దొంగ వ్యాపారులు, దోపిడీ వర్తకులు, మొదలైన పరాన్నజీవులకుమాత్రం కన్నతండ్రిలా కనిపించే వాడు! నాయుడుగారికి కావలసింది అదే. అది నిర్విరామంగా సాగిపోతూంది. నాయుడుగారికి ఎక్కడ చూచినా తనలాంటివాళ్ళ సంఖ్య హెచ్చుగా కనిపించేది. ఈ డబ్బున్న ఘరానా మనుష్యుల జీవితాలు తరచిచూస్తే, తనుచేసేది ఏమీ కాదు అని సమర్థించుకునే వాడాయన!

అదంతా ఎందుకెక్కాని, తనలాంటి విద్యాలు బయటపెట్టకూడదు. ఆ వేళ ఆవలబజారు కోమటిని గురించి, తన యజమాని తనచేతే, అంతపని చేయించాడు గదా. తనుకక్కుర్తిపడితే తప్పెందుకో తెలీలేదు. తను యిన్నాళ్ళు కాని పుచ్చుకోకుండా పని చేసే సానుభూతి చూపిన అపాయిా ఎవడూ లేడు. ఈ రోజున నాలుగురాళ్ళు సంపాయించి, ఘరానాగా తిరగ్గానే అంతా గౌరవమే!

ఎవరయినా నాయుడుగారిదగ్గర నీతి నిజాయితీల గురించి ఇప్పుడు మాట్లాడితే పెదవులు విరిచి వల్లగా సమాధానం చెప్పేటే ఒప్పుకుని తీవలవేంకే "మాడండీ, నీతి, నియమం ఉండడం మంచిదే మనజీవితంలో అటువంటి పవిత్ర భావాలు లేగి ఉండవలసిన అవశ్యకత ఎంతయినా ఉంది. ఎలాంటి నియమాలయినా ఎల్లుండడం అవసరం. మన ప్రపంచమంతా పుచ్చిపోయింది. పాడయిపోయింది. నీతి నియమాలు పాటించేవాళ్ళు చాలా అరుదయిపోయారు. అలాంటి సమయంలో ఒకడూ, యిద్దరూ మడిగట్టుకూర్చున్నీ, నీతి నియమాల్ని, ఉద్ధరిస్తామంటే లాభం లేదు. సరిగదా ఆమాయలోపడి మునిగి చక్కాపోతరు. అందుచేత బుద్ధిమంతుడయిన వాడెప్పుడూ, ఒక చేత్తో ఆ మాయను అసరాగా తీసుకుని, రెండోచేత్తో దాన్ని చెండాడాలి. అంతేగాని మాయమాయ అని అఘోరిస్తే లాభం ఏమిటి?" అంటాడు ధీమాగా.

ఏది ఎలాగున్నా యిప్పుడుమాత్రం నాయుడు గారికి కొంచెం గౌరవం మర్యాద కలిగాయి. ఊళ్ళో పెద్దలూ, మోతుబరులూ, నమస్కారాలు చేస్తున్నారు. నాయుడుగారు చాలా సంతోషంగా, ఆనందంగా కాలం గడుపుతున్నారు. దానధర్మాలు చేస్తున్నారు. పెద్దవాళ్లు చిన్నవాళ్లు ఇప్పుడు దాన కర్ణుడు అన్నంతవరకు కూడా పొగిడేస్తున్నారు నాయుడు గారిని.

## 2

సరిగా యీ రోజులలోనే నేను నాయుడు గారి దాతృత్వం, కీర్తి విని, ప్రక్కనున్నా యింత వరకు కనిపెట్టలేక పోయినందుకు విచారించాను. నా కష్టసుఖాలు, బాధలు, ఆయనకు బాగా తెలుసు. ఆయన ఆఫీసులో ఏదో గుమాస్తాపని ఖాళీగా ఉందని తెలిసి వేయించమని అడిగితే—పొరుగువాణ్ణైనా చూడకుండా నిక్కచ్చిగా అడిగాడే లంచం! ఆఖరికి ఆఫీసరుని ప్రతిమిలాడినా లాభం లేదనీ, ఈయనవల్లనే అవుతుందనీ బంట్రోతు కూడా స్పష్టంగా చెప్పేవాడు పావులా పుచ్చుకున్న తరువాత. ఆయన కాళ్లావేళ్లాపడి ప్రతిమిలాడి నెలనెలా పదిహేనొప్పున యిచ్చుకుంటానని ఆ నౌకరీలో చేరాను.

ఆయనమాత్రం నాదగ్గర డబ్బుపుచ్చుకోవడం చేతో, మరెందుచేతో గాని నాయందమితవాత్సల్యం ప్రకటించేవాడు. తీరిక సమయాలలో గుమాస్తాయొక్క కుటుంబ బాధ్యతలు, కష్టసుఖాలు, అనేక సమస్యల గూర్చి సమగ్రంగా ఉపన్యాసాలు దంచేసేవాడు.

ఇంకా సంతోషంగా ఉన్నప్పుడు "చూడరా అబ్బాయీ! నీదగ్గరనో పదిరూపాయలు పుచ్చుకుంటున్నానని బాధపడకు. అది గుమాస్తా ఉద్యోగ ధర్మం. పైపెచ్చు మననియమం. అసలీ గుమాస్తాగాడి కింతతక్కువ జీతమియ్యడం ఎంచేతో తెలుసా. అంటే, అంతే, అలా ఉండకపోతే యీ గుమాస్తా గిరీకది లేదని, సంసారం సాగరంలో తోసేసి సన్యాసం పుచ్చుకోవడం మేలు. తెలిసిందా. ఈ కిటుకు లన్నీ తెలుసుకుని నీ ఉద్యోగం స్థిరంగా నిర్వర్తించావా అందరికీ మంచివాడివే. నీ ఆఫీసరు కూడా ఆనం దిస్తాడు. లేకపోతే చాలావిచారించవలసిన పరిస్థితులలో పడి చిక్కుపోతావు. అతి గాహనకేసుతో నాయనా!" అంటాడు.

అన్నిటికీ నేను చెవులు తోడించి తలూం వేస్తూండడం మొదలు పెట్టాను. అందుకే గాబోలు నాయుడుగారు నేనంటే పడిచచ్చిపోయేవాడు. నేనంటే ఆయనకు ఎక్కడలేని తెలివితేటలా ఊడి పడేవి. మన బ్రహ్మాండ నాయకులకు పయితంలేని వక్తృత్వపటిమ దక్కవచ్చేది. ఆయన యెప్పుడయినా ఉల్లాసంగా ఉన్నప్పుడు నే కనపడితే చాలు. కూర్చోమని కప్పు కాఫీయిచ్చి మొదలెట్టేవాడు.

"ఇలా చూడరా అబ్బాయీ (నేమాస్తూ నే ఉంటాను లెండి) బ్రిటిషువాళ్ళు మనదేశం దోచుకుందుకు వచ్చారు. వాళ్ళకు బలం తగ్గింది. దేశం దేశాన్నే దోచేసుకు పోయారు మన నోళ్ళు నొక్కి. అదే వ్యాపారం అయింది. వాళ్ళని తరిమేశాం ఏవో బ్రహ్మాండమయిన ఉద్యమాలు నడిపి. ఆ ఉద్యమాలలో చచ్చినవాళ్ళూ, త్యాగం చేసినవాళ్ళూ ఎవరు? నువ్వూ నేనే. అయినా యిప్పుడు నీకూ నాకూ ఏముంది? యిదివరకేముందో అదే నీకూ నాకూ. ఓకానీ ఎక్కువివాళ్లంటే ఎక్కడలేని ఆర్థిక సమస్యలు, విదేశాంగ వ్యవహారాలు అడ్డంపడ్డాయి. కానీ యీ పరిశ్రమాధికారులూ, భూస్వాములు, గుత్తేదారులు పెట్టుబడిదారులూ ఎలా డబ్బు చేసుకుంటున్నారో! ఇళ్ళమీదయిళ్ళు, కారుమీదకారు, మాటమీద మాటు విలాసాలు, సరదాలు, పెళ్ళిళ్ళు, విందులు అన్నీను. ఇవన్నీ చట్టసమ్మతాలే? న్యాయమైనవే? ధర్మసంబంధాలే? నువ్వూ నేనూ అనడానికి వీల్లేదు. నువ్వు "ఆ" అన్నావంటే చట్టవిరుద్ధం. నువ్వూ, నీ ఉద్యోగం, నీ బ్రతుకు కూలిపోతాయి. నాడిమపి అవుతాయి. అంచేత నీచాతనయినంతవరకు నువ్వూ దోచుకుంటూండు. ఇది పరమరహస్యం సుమా! మనయిద్దరి మధ్య అంతరంగిక సంభాషణమాత్రమే. ఎటొచ్చీ వాళ్ళకు నీకూ లేదా ఏమిటంటే బలం వాళ్లని రక్షిస్తోంది మన్ని భక్షిస్తోంది అంతే."

"ఈ పరిస్థితు లున్నంతవరకూ నువ్వూ నేనూ మడికట్టుకు కూర్చుంటే నశించిపోతాము. అయినా గాని మనము చేసేది ఒక లెక్కా పైవాటితో పోలిస్తే. ఈ సొంతవ్యాపారాలు, పరిశ్రమలు, డబ్బుచేసుకునే దాలు, ఉన్నంతవరకు, నన్ను నువ్వు, నిన్ను మరోడూ, మనందర్నీ యింకోడూ కొల్లగొట్టుకోడం ఎలా పోతుంది. ఏరూపంలోనైనా ఒకడ్ని మరోడు పీడించుకు తినడాన్ని ఈ సంఘం సమర్థిస్తూ, చట్టాలు రక్షిస్తూ ఉంటే యీ దగాలుపోవు. మడిగట్టుకు మూర్ఖులా నువ్వూ నేనూ కూర్చోడం చట్టవిరుద్ధం అది నేరమే!" అని ముగించేవాడు ఉపన్యాసం.

ఆయన చిరునవ్వు అప్పటి ప్రవర్తనా చూసి తన్ను తాను మెచ్చుకుంటూ ఉంటాడని తేలికగా అర్థమవుతుంది. నాకు మాత్రం అది వింటూన్నప్పుడు అంతా సమంజసంగా నే కన్పించేది.

స్వార్థంకోసం ఒకడిని మరోడు దోపిడీచేసుకోడాన్ని అంతుచేసి, కష్టపడేవాళ్ళ శ్రమకు తగిన

ప్రతిఫలం, విశ్రాంతి, వాళ్ల సౌఖ్యాలకు అవకాశాలూ, సౌకర్యాలూయిస్తే అంతకన్న యింకేం కావాలి మరి.

నాయుడుగారి ఉద్బోధ నా మెదడులో పూర్తిగా పట్టిపోయింది. నా ఆర్థికస్థితి నన్ను పూర్తిగా క్రుంగదీసింది. నాయుడుగారి పాదచ్ఛాయలలో నేనూ నడవడం ప్రారంభించాను. అనుకోని ఆ దినచర్య నాకు సాధ్యమయింది.

అదే నాయుడుగారికి కరతలామలక మయింది!

పేదవాళ్ళు చెమటోడ్చి సంపాయించినది, ఏడుస్తూ యిచ్చినా, ధనవంతులు తమ మోసం సొమ్ము ఏడుస్తూ యిచ్చినా, సమాన ఔదార్యంతో పుచ్చుకోవడంలో ఉన్న ఘనత ఆయనకు పూర్తిగా దక్కింది.

ఈ మంచి గుణాలు అలవడిన వెనక నాయుడు గారు బుల్లిగుమాస్తాతంలే పెదగుమాస్తా అయినారు. ఇప్పుడు యీయన ప్రతిభ మహోజ్వలాయమానంగా వెలుగుతోంది. నాయుడుగారి పేరు చెప్పితే అధికారులు సహా వణుకుతారు.

అయినా చట్ట విరుద్ధంగా ఎంతకాలము మనగలం. నాయుడుగారు లంచం పుచ్చుకుంటూండగానే రక్షకభట వరిమువారు పట్టుకున్నారుట. "ఆరరే" అన్నారందరూ. "ఇంత ధర్మాత్ముడు యీయనకీ గతేమిటి పాపం!" అన్నారు కొందరు. "మంచి పని యిందన్నారు" చిన్న గుమాస్తాలు.

నేను మాత్రం నా జాగ్రత్త నేను పడ్డాను. అందరిగతి అలాగే ఉంటుందేమిటి? నావిధి నేను మామూలుగానే నిర్వర్తిస్తున్నా కొంత మెలకువతో ఉంటున్నాను. నాయుడుగారిని కచ్చేరీనుండి తాత్కాలికంగా తప్పించారు. చాలా ముందు వాడినయినా, నాకన్న పాతుకుపోయిన పాతగుమాస్తాలున్నా నాయుడుగారి ఖాళీలో నన్నే పడేశారు.

గురూపదేశం చాలా బాగా పనిచేసింది మరి!

అధికారులు నన్నే ఎందుకు పెద్ద గుమస్తాగా వేశారో ఎవరికీ అర్థం అవలేదు, నాకూ ఆ అధికారులకూ తప్పిస్తే.

ఇరుగుపొరుగు వారంతా నా పూర్వజన్మ సుకృతం అన్నారు. నేను మాత్రం కాదనడమెందుకు? ఆఫీసు వాళ్ళంతా నా అదృష్టమన్నారు. అదీ కాదనలేకపోయాను. అధికార్లు అతి చురుకైన వాడినన్నారు. 'మహాప్రభో!' 'మహాప్రసాదం' అన్నాను నేను.

ఈ సుభాషితాలతోపాటు నాయుడుగారి ఖర్మగురించీ తెలివితక్కువగురించీ కూడా వేయి నోళ్ళ ప్రవచించారు. అంతా చాలా సానుభూతి వెల్లడి చేశారు. ఆయన చేసినదంతా న్యాయమేనట! కర్మమాత్రం వక్రంగా తిరిగిందట. కర్మ వక్రించి తిరిగినా అదృష్టం బాగుండాలట! అందుకే ఆపూళ్ళో ఉన్న కోతుబరిషాహుకారు తాను జామీనుండి ఆయన్ని విడుదల చేయించాడుట. నాయుడుగారు మాత్రం ఆ తర్వాత నాకు కనిపించలేదు.

కేసు లావాదేవీలు, పోలీసుల బేరాలు, ప్లీడర్ల నోక పీకుడు వ్యవహారాల్లో ఆయన మునిగిపోయారు.

ఆయన యిదివరలో చేసి వదలిన పనిలో నేను నిమగ్నుడనయ్యాను. ఒకరిని గురించి ఇంకొకరు ఆలోచించడానికయినా తీరిక కనుపించడం లేదు. అయినాగాని ఆయన్ని గురించిన వార్తలుమాత్రం పుష్కలంగా వస్తున్నాయి. రోజు రోజుకీ సంపాదించినది కాస్త కక్కుతున్నాడుట!

ఎంత దారుణ కోపమున్నా యీ ప్రజలు "పాపం" అనే సానుభూతి పదం ఎందుకు ఉపయోగిస్తారో! వాళ్ళ అంతరార్థం లోతు కనుక్కోడం కూడా కష్టమే.

"కోట్లు కొల్లైనవాడు, కాటికి వెళ్ళైనవాడు సమానం!" అని తెలుగుసామెత. దీన్లో ఎంత సత్యం లేకపోతే ఇది చిరంజీవియై ప్రజల నాలుకలపై నిలుస్తుంది!

బ్రిటిషువాళ్ళు మనకు జేసిన మహోపకారాల్లో కల్లా ఉత్కృష్టకర్మ యీ న్యాయస్థానాల ఏర్పాటు! అటువంటి మేలు మన తెలుగువాళ్ళు వల్లకాడుతో పోల్చారు. అందుకే తెలుగువాళ్లకు చాలారోజులకి గాని ఆంధ్రరాష్ట్రం యివ్వలేదు!

అసలు 'ఉన్నమాటంటే ఉలుకెక్కువట!' యిదీ తెలుగుసామెతే. ఇలా నిక్కచ్చిగా మాట్లాడగలిగిన జాతిగనకే అందరికీ కంటకమయింది. 'నిజమాడితే నిష్ఠూరం' అందుచే కష్టాలువస్తాయి.

ఏమయితేనేం తెలుగువాళ్ళమాట మట్టుకి, నాయుడుగారిని కాటికెక్కించింది.

నేనున్న ప్రస్తుత పరిస్థితుల ప్రభావంవల్ల కాబోలు, నాయుడు గారు తిరిగి రాకుండా ఉంటే చాలునని పిస్తూ వచ్చింది. ఆయన నిజంగా కాటికెక్కినా సంతోషించేవాడినే నేను. దేవుడికి వేలకువేలు నమస్కారాలు పెట్టాను. "ఆయన్ని జైలులోకి పంపునాయనా. అంతకీ ఆయనయందు నీకు ప్రేమా, దయా, పుట్టుకొస్తే నీ స్వర్గంలో కూర్చోబెట్టుకుని సర్వసుఖాలూ అనుభవింపజెయ్యి. అంతేగాని నామీదకు దండెత్తకుండా చూడు." అని.

శనివారంనాడు ఉపవాసాలుగూడా మొదలు పెట్టాను. అన్నం మెతుకు కలలోకూడా ముట్టనని ప్రమాణం చేసుకున్నాను. మహా తంటే

మినపరొట్టె ఫలహారం మాత్రమే. మధ్య మధ్య ఏకాదశి ఉపవాసాలు, పూజలు యింటిదగ్గర భక్తులందరినీ పోగుచేసి భజనలు కూడా చేయించడం మొదలు పెట్టాను. కనిపించిన దేవుడి గుడికల్లా నమస్కారం పెట్టాను. కనిపించని దేవుణ్ణి భక్తితో కొల్వడం ఆరంభించాను. ఆఖరికి ఆ కేసులో నాయుడు గారికి జీవితాంతం శిక్ష వేయించేందుకు గాను ఆ భగవంతుడికి నా తలమీద వెంట్రుకలు, గడ్డము మీదుగట్టి మొక్కుకున్నాను.

నాయుడు గారి కేసునుగురించి చాలా ఆత్రుతతో తెలుసుకుంటున్నాను. ఈ మధ్య ఆయన కేసు గురించి వింటూంటే నాకు చాలా విచారం, కోపం, పొడుచుకువచ్చాయి. "ఇంత భక్తితో కొలుస్తున్నా, భగవంతుడికి దయలేదా!" అనుకున్నాను. దేవుడు నమ్మిన వాళ్ళను మోసం చెయ్యడుట. ఏదో వేషం వేసుకునయినా సరే వచ్చి భక్తులని రక్షించి తీరతాడని శ్రుతిస్మృతులు ఘోషిస్తున్నాయి. అయినా నేడో రేపో తేలుతుంది దేవుడి సంగతి!" అనుకునే వాడిని.

ఒక్కొక్కసారి నాయుడుగారి ప్లీడరుగారి సంగతి వింటూంటే, అసలు దేవుడనేవాడు ఉన్నాడా అనే సంశయానికి కూడా తావొచ్చింది. నాయుడు గారి ప్లీడరు అఖండ ప్రతిభావంతుడట! చాలా గట్టివాడట. ఎదుట వారిని ఉతికేస్తున్నాడుటంటే! అతడు అడ్డు ప్రశ్నలో అఖండుడట. ప్రతికక్షులు ఆతని యక్ష ప్రశ్నలకి జవాబు లీయలేక పరుగు లంకించుకున్నారట! యివీ వార్తలు!

దేవుడి మీద కోపం ముంచుకు వచ్చింది. "అయినా నేడో రేపో తేలుతుంది దేవుడి సంగతి అప్పుడు చెప్తాను. ప్రపంచం అంతా చాటేస్తాను. తర్వాత చూసుకుంటా" ననుకునేవాడిని నేను. అలాగే తేలింది. దేవుడున్నాడా లేడా? అనే ప్రశ్నకు నిలువు జవాబు.

నాయుడు గారికి ఆరు నెలల కఠిన కారాగార వాసం విధించారు.

"రక్షించావు దేవుడా!" అని వేయినమస్కారాలు చేశాను. చేసిన పూజలు పెట్టిన నమస్కారాలు ఊరికే పోతాయా!

ఇంక దేవుడి మొక్కు మంచిది చూసి తీర్చాలి. వెంటనే బయలుదేరి వెడదామనుకున్నా. కాని చాలా రాత్రి కావడంవల్ల మానేశాను. మరునాడుదయాన్నే బయలుదేరి పురోహితుడి యింటికి వెళ్ళాను. ఎందుకో అడవిలాంటి నా గడ్డాన్ని వదిలిపెట్టడానికి తయారవడం కష్టంగానే ఉంది.

అయినా యిది భగవంతుడితో వ్యవహారం. ఆయన ముందా మనదాటులు. విచారంతో గడ్డాన్ని, ప్రేమతో హిమాచలంలాంటి నా బుర్ర తడుముకున్నాను. ఆ విచారంలో నా కళ్ళలోనుండి ఒకటి రెండు అశ్రు కణాలు దొర్లాయేమో నాకు తెలీకుండా. ఇలా నాలో నేను బాధపడుతూంటే, శాస్త్రులుగారు తమ తతంగాన్ని మొదలు పెట్టారు.

"మాశారా" అన్నాడాయన నన్ను చూడగానే.

"ఆ! ఏమిటీ" అంటూ ఉలిక్కి పడి ముందు వెనకా చూశాను.

"ఏమీ లేదులెండి" అన్నాడు తాపీగా. ఆ సమాధానం చూచేసరికి నా ఒళ్ళు మండింది.

"ఏమీ లేకపోతే ఏం చూడమన్నారయ్యా!" అన్నా విసుగ్గా.

"అబ్బే! ఏమీ లేదు. ఆ ముసలిముండా వాడు చాలా మంచివాడు."

"ఆ ముండావాడెవరో కాస్త చెలవిద్దురూ బాబూ."

"ఆ నాయుడు గారండీ! చాలా సన్మార్గుడు. తమకు యీ ఉద్యోగం ఆయనే వేయించారుట గా! ధర్మాత్ముడు."

"అదే తమబోటి పెద్దలు చెప్పుకుంటున్నారీ ఊరిలో" అన్నా కోపం పట్టలేక.

"మంచివాడికే కష్టాలన్నీను" అని పెదవి విరిచి, బల్లి అరిచినట్లు చప్పుడు చేసి "ఇంకేమిటిలెండి లాభం! ఉద్యోగమూ పోతుంది. శిక్షను అనుభవించాలి" అన్నాడు తన సానుభూతి యావత్తూ మాటలద్వారా నే గాకుండా ముఖంద్వారా కూడా ప్రకటిస్తూ.

"అవునంతే మరి!"

"అయినా పెద్ద కోర్టు కెళతాడుటలెండి."

"అయితే యింకా నాశనమవుతాడట!" అన్నా నా ఆనందం కప్పిపుచ్చడానికి ప్రయత్నం చేస్తూనే.

"ఏమో మరి"

"పెద్దకోర్టు కెళ్ళడం అనవసరం. ఏదో ఓ చిల్లి గవ్వ యింట మిగిలితే అది ఖర్చు చేసుకోవడంకే జరుగుతుంది."

"నేనూ అదే చెప్పానండి. నాసగరకు విన్నవస్తే."

"చాలాసేపయింది వెళ్ళొస్తా" నంటూ ఓ నమస్కారం ఆయన మొహాన్ని కొట్టేసి బయలుదేరాను యింటివైపు.

పాపం ఎందుకు వచ్చానో ఎంచేత వెళ్ళి పోతున్నానో అర్థం అవక గాబోలు శాస్త్రులుగారు అలాగే నిలబడిపోయారు నిశ్చేష్టంగా. "ఇదే దేవుడి పరీక్ష" అనుకుంటూ యిల్లు చేరాను, మిగిలిన ఆఫీసు పని ముగించడానికి.

## 3

నాయుడుగారి సంగతేమీ తెలీటంలేదు. ఆఖరుకు ఆయన కుటుంబం కూడా మావూరు వదిలి ఆయన బావమరిది గారింటికి పోయిందిట. ఆయనను గూర్చి నేను చాలా వాకబు చేశాను. కనిపించిన ప్రతివ్యక్తిని ప్రశ్నించాను. ఒక్క సెలవుతీసుకుని స్వయంగా వెళ్ళడం తప్పించి మిగతాపని అంతా చేశాను. తెలిసి యేడిస్తేగా. విసుగెత్తి పోతేపోనీ అని ఊరుకున్నాను. ఆఖరుకి పోస్టలు శాఖవారికికూడా ఆయన చిరునామా తెలీదుట! జైలుకుపోయి ఉంటాడనుకున్నాను.

ఈ మధ్య నాకు యీ ఉద్యోగం ఖాయం చేసి వర్కు ఆర్డర్లుకూడా ఇచ్చేశారు. నా అదృష్టానికి ఎంతో సంతోషించాను. ఆఖరుకి సత్యనారాయణ వ్రతం కూడా చేయించాను. ఇక కొత్త నుంచి ముహూర్తం చూసి యీ జాత్ర మొక్కుబడికూడా తీర్చేస్తే బాగుండుననుకున్నా. మనం అనుకున్నంతా జరిగింది.

ఆ నాయుడు పత్తా లేదు. పాపం జైలుకుపోయి ఉంటాడు!

కొత్త వేగంగా యీ వైభవంకూడా తీర్చేస్తే యిక ముప్పుండదని, ఆ శాస్త్రులగారిచే తిరుపతిలో మొక్కుబడి తీర్చేదానికి ముహూర్తం ఏర్పాటు చేయించాను. ఏదో వేగంగా అవుతుందని నేను ఆలోచిస్తుంటే వాడి సొమ్ముపోయినట్లు శాస్త్రి నాలుగు రోజులాలస్యంగా యెంచాడా ముహూర్తం. కొందరు చుట్టాలనీ, పక్కాలనీ పిల్చేశాను సంతోషంకొద్దీ. పోనీ దేవుణ్ణిచూసి పోతారని!

మా బావగారిని చూచి చాలా కాలం అయింది. వెధవ ఉద్యోగాలు! ఎంతెంతదూరాలు పోతున్నారు ప్రజలు. అంతదూరం అయినా ఆయన యేలాగయినా కష్టపడివచ్చి నా మొక్కుబడి మహోత్సవం చూసి పోతానని ఉత్తరం వ్రాశాడు. ఆయన్ని చూసి కూడా చాలా కాలం అయింది. ఆయన రూపురేఖలే మరచిపోయాను పూర్తిగా.

ఈ శుభవార్త చెప్పడానికి నా భార్యని పిలిచాను. ఆవిడ హంసయానంతో వచ్చిరాడంతోటే యీ వార్త చెప్పాను. ఎంతో ఆప్యాయంగా "మీ అన్నను చాలాచాలా చూడాలనిఉంది." అన్నాను.

"బాగా చేశారు మీరు చూడలేదా యేమిటి నా పెళ్ళికి?" అంది. కొత్త సిగ్గు అభినయిస్తూ.

"ఎంతకాలమయిందో ఆయన్ను చూచి? పని తొందరల్లో వస్తాడో రాడో!"

"మొన్న మా పుట్టింటికి వెళ్ళినప్పుడు చూశాను నేను. వాడూ మీలాగే ఏదో మొక్కుకుని గడ్డం పెంచి ఆనవాలు పట్టడానికికూడా వీల్లేకుండా మారిపోయాడు. ఎంతపని తొందరలోఉన్నా నన్నయినా చూడడానికి రాకపోతాడా?"

"అయితే ఆయనకుకూడా ఏదో మొక్కుబడి ఉన్నదన్నమాట మనలాగే! ఎందుకో ఆ మొక్కుబడి?"

"ఏమో ఎవడికి తెలుసు మీ మొక్కుబడులు మీరూను!"

"వెళ్ళు నీపని నువ్వు జూసుకో" అన్నాను ఆమె విసిరిన మాటలకు కొత్త కోపం తెచ్చుకుని. ఆమె విసురుగా లోపలకు వెళ్ళిపోయింది.

మరునాడు నయం ముహూర్తం దగ్గరకొస్తున్నా మా బావగారు రావడం కనపడ్డం లేదు. నాకాయన మొక్కుబడి ఎందుకో తెలుసుకోవాలని తహతహ! ఆ గడ్డం కోసం నాగడ్డం ఇంతగా ఓపికపట్టడం నాకే ఆశ్చర్యం వేసింది. గడ్డానికి గడ్డానికీమధ్య ఎంత సామరస్యం వుంది! రోడ్డు వైపు కన్ను మూయకుండా చూస్తున్నాను. ఆగడంకోసం చాలా మారాం పెడుతోంది మనస్సు. ముహూర్తం ఘడియలు సమీపిస్తున్నాయి. అయినా జాడలేదు. "ఇంక లేవండి బాబూ!" అంటూ అరిచాడు పురోహితుడు ఏదో మునిగిపోయినట్లు. గడ్డం కోసం ఎదురుచూస్తున్నా ఘటం లేవక తప్పిందికాదు.

ఇలా లేచానో లేదో, దూరంలో గుఱ్ఱంబండి చప్పుడయింది. తొంగిచూద్దునుగదా బండిలోంచి కూడా ఓగడ్డం నావైపే తొంగిచూస్తోంది. సరీగా గుమ్మంముందు ఆగింది. నాగడ్డం ఆనందంతో ఊగిపోయింది, ఆయన బండి దిగీదిగడంతోనే "వచ్చారా" అంటూ ఆనందాతిరేకంతో ఆలింగనం చేసుకున్నాను.

ఆప్యాయంగా గడ్డాలుకూడా కలిసిమెలిసి కొంచెం చిక్కుపడి చాపలా అల్లుకున్నాయి ఒకదానితో ఒకటి!

మావాళ్ళంతా ఆశ్చర్యంతో చూస్తున్నారు.

మా ఆవిడ కూడా గబగబావచ్చి ప్రక్కన నిలబడింది.

మళ్ళీ "క్షేమంగా వచ్చారా!" అన్నా హర్ష పులకిత గాత్రుడనై.

"ఆ వచ్చానండీ" అన్నాడాయన వర్షంచిలికినట్లు.

"అయితే బావగారూ!" అన్నాను. ఆయన మొక్కుబడిసంగతి అడుగుదామని.

"ఇంకా నన్ను గుర్తుపట్టలేదుటండీ" అనిఆయన—

"ఆయన మీ బావగారు కాదండీ" అని నా చెవిలో మా ఆవిడ, అనడం ఒకేసారిగా జరిగాయి.

ఆశ్చర్యంతో పరిశీలించిచూద్దును. యింకెవరు? మా గురువుగారు! నాయుడుగారే!

"మీరా!" అన్నాను దిగ్భ్రమచెంది.

"నే నేనోయి. కేసు గెల్చాను దచ్చి చెడి" అన్నాడాయన ఆనందబాష్పాలు రాలుస్తూ.

నాప్రాణంమాత్రం అలా మిగిలించే ఎగిరి పోయింది!

"నాపోష్టింగార్డర్లు కూడా ఇచ్చేశారు!" అన్నారాయన సంతోషంగా.

నాపరిస్థితి జ్ఞాపకంవచ్చి ఆయన్ని పీక పిసికేద్దామా అన్నంతకోపము, అసూయ పుట్టుకొచ్చాయి. ఆవేశంలో యేమీ మాట్లాడలేకపోయాను.

"ఇంత క్రొత్తవాడవుగదా! నీ కెలా యిచ్చారోయి నాఖాళీ ఉద్యోగం?"

"తమ చలవవల్లనే. నేను మీ అడుగుజాడల్లో నడిచాను. అంతే!"

ఆయన కూడా లేత నవ్వులు పెదవుల్లోంచి వదులుతూ ఓ కౌగిలం ఇచ్చారు, నన్ను చూడమంటూ. ఆయనకు అధికారపదవి యిచ్చారు. నన్ను మాత్రం ఆ పెద్దగుమాస్తా పదవిలోంచి తీసెయ్యలేదు. అదే పది వేలనుకున్నారు.

"ఈ గడ్డం, యిదంతా యేమిటి" అన్నాడాయన.

"తిమర్గి యీ చిక్కునుండి తప్పించేందుకుగాను దేవుడికి మొక్కుబడి." అన్నాను.

"సెబాష్ ఇదంతా దేవుడిదయే సందేహమేమిటి? నేనూ యీ కేసునుండి బయటపడేయ్యమని ఆదేవుడికి మొక్కుకున్నాను."

"అయితే యీ శుభముహూర్తాన్నే మనం యిద్దరం యీ మొక్కుబడులు తీర్చుకుందాం రండి" అన్నాను నవ్వుతూ.

"అలాగే పదవోయి" అన్నాడాయన.

"అయితే గురువుగారూ! కొంపదీసి మిమ్మల్ని మరో కోర్టుకు లాక్కెళ్ళి మళ్ళీ మరోలా తీర్పు చెప్తారేమో!" అన్నా సందేహంతో.

"అదంతా ప్లీడర్కి తెలుసునోయ్. మన తీర్పుకిక తిరుగులేదు తెలుసునా! యిదే దీనికి ఉన్నత న్యాయస్థానం!" అన్నాడాయన ధీమాగా.

